క్లుప్తంగా

దాసాంజనేయునికి లక్ష తమలపాకుల పూజ



తాళ్లరేవు దాసాంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ హోమంలో పాల్గొన్న భక్తులు

తాళ్లరేవు: శ్రీ హనుమత్ వ్రత మహోత్సవాలలో భాగంగా తాళ్లరేవు ప్రధాన రహదారిలో వేంచేసి యున్న శ్రీ సువర్చలా సమేత దాసాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం లక్ష తమలపాకులు, సింధూర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 17 వరకు స్వామివారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు కొండవీటి సుబ్రహ్మణ్యశర్మ, శ్రీరామ్‌ల నేతృత్వంలో విశేష పూజలు చేశారు. సాయంత్రం నవగ్రహాలు, పూర్ణాహుతి, సీతారామస్వామి దివ్యకల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

గోకులానికి పశుగ్రాసం వితరణ

ఐ.పోలవరం: వీరేశ్వరస్వామి గోకులానికి ఓ భక్తుడు సోమవారం పశుగ్రాసం వితరణ చేశారు. గోదాశి వారిపాలెం గ్రామానికి చెందిన జగత సత్యనారాయణ సుమారు రూ.20 వేలు విలువ చేసే ట్రక్కు ఎండుగడ్డిని అందజేశారు. గోకులంలో 15 గోవులను దేవస్థానం సంరక్షణ చేస్తోంది. వీటి పోషణ నిమిత్తం దాతలు వివిధ రూపాల్లో సహకరిస్తున్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ దాతను అభినందించారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు

ఐ.పోలవరం: సోమవారం నుంచి పవిత్ర ధనుర్మాసం ప్రారంభం కావడంతో మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయ క్షేత్ర పాలకులు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. నెల రోజులు భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు జరుగుతాయి. 26వ తేదీన లక్ష తులసి పూజ, జనవరి 13న గోదాదేవి కల్యాణం జరపనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

అమలాపురం రూరల్: సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సోమవారం విద్యార్థులు వ్యవసాయం క్షేత్రాల పర్యటన చేశారు. వ్యవసాయంలో రైతులు ఎదుర్కొనే సమస్యలు, పంటసాగు విధానాలపై విద్యార్థులు తెలుసుకున్నారు. పాఠశాల డైరెక్టర్ మనువిహార్, ప్రిన్సిపాల్ దేవి దీక్షిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ టోర్నమెంట్ పనులకు శంకుస్థాపన



ఎస్.యానంలో టోర్నమెంట్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, ఆర్డీవో మాధవీలత

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలోని సముద్ర తీర ప్రాంతంలో నిర్వహించే జాతీయ స్థాయి బీచ్ వాలీబాల్ టోర్నమెంటు పనులకు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆర్డీవో కె.మాధవీలతతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో ఎస్.యానం గ్రామంలో మహిళా బీచ్ వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్టు టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీడీ గొలకోటి ఫణీంద్ర తెలిపారు. ఈ పోటీల్లో గోవా, గుజరాత్, కేరళ, తమిళనాడు, వెస్ట్ బెంగాల్, పాండిచ్చేరి, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొంటాయని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఎస్.దివాకర్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ పలచోళ్ల పద్మనాభం, వైస్ చైర్మన్ లంకే భీమరాజు, జోగిరాజా, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, దంగేటి చిట్టిబాబు, పినిశెట్టి నరసింహారావు, చీకట్ల శ్రీను పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సందర్శన



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న దయాళన్

యానాం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం పుదుచ్చేరి జిల్లా రిజిస్ట్రార్ దయాళన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో భూములకు సంబంధించి జరుగుతున్న రిజిస్ట్రేషన్‌లు, ధరలు, పౌరులకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ తదితర విషయాల గురించి సబ్ రిజిస్ట్రార్ రెయ్యా శ్రీనివాసును అడిగి తెలుసుకున్నారు. తొలిసారిగా యానాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన దయాళన్‌ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



శిథిలావస్థకు చేరుకున్న అల్లవరం ఓహెచ్‌ఆర్ ట్యాంక్



నిర్వహణ లేక ట్యాంకుపై చెట్టు పెరిగి వేలాడుతున్న ఊడలు

- శిథిలావస్థలో ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- నిర్వహణపై కొరవడిన శ్రద్ధ



ఈదరపల్లిలో నిర్వహణ లేక ఫిల్టర్ బెడ్‌లో పెరిగిన గడ్డి

అల్లవరం: ప్రాణికోటికి జీవనాధారమైన తాగునీరు అందరికీ పుష్కలంగా లభించాలంటే క్షేత్రస్థాయిలో నీటి వనరులు అందుబాటులో ఉండాలి. ఒక వేళ నీటి వనరులు అందుబాటులో లేకపోతే ప్రజల అవసరాలకు తగ్గట్టుగా సృష్టించాలి. కాలువలు, భూగర్భ జలాల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి తాగునీటిగా సరఫరా చేయాలి. ఇవన్నీ చేయాలంటే గ్రామాల్లో నీటిని సరఫరా చేసేందుకు అనువైన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు అందుబాటులో ఉండాలి. ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ల్లో స్టోర్ చేసిన నీటిని ప్రజావసరాలకు పంపిణీ చేయవలసి ఉంది. అయితే రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి.

శివారు ప్రాంత ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించాలనే సంకల్పంతో మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి రూరల్ వాటర్ స్కీమ్‌ను శివారు గ్రామాల వరకు తీసుకువెళ్లారు. రూరల్ వాటర్ స్కీమ్ ద్వారా అల్లవరం మండలంలో గుండెపూడి, ఉప్పలగుప్తం మండలంలో చల్లపల్లి, అమలాపురం మండలంలో పేరూరు గ్రామాలను ఎంపిక చేశారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నిర్మించారు. దానికి అనుబంధంగా ఫిల్టర్ బెడ్‌లు, ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లను నిర్మించి శుద్ధమైన తాగునీటిని ప్రతి కుటుంబానికి అందించారు. ఈ ప్రాజెక్టు ప్రారంభమై దాదాపుగా 25 సంవత్సరాలు కావస్తుంది. అప్పుడు నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లను నెలలో రెండు సార్లు శుభ్రం చేయాలి. శుభ్రం చేయాలంటే మెట్ల ద్వారా ట్యాంక్ పైకి ఎక్కాల్సి ఉంది. అయితే చాలా ట్యాంకులకు మెట్లు పాడయ్యాయి. ఇవే కాకుండా ఓహెచ్‌ఆర్ ట్యాంక్ పిల్లర్ల వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. ట్యాంక్‌లపై చెట్లు, పొదలు పెరిగి నిర్మాణాలను దెబ్బతీస్తున్నాయి. ఫిల్టర్ బెడ్‌ల్లో గడ్డి పెరిగి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లు పాడవుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదు. కొత్త ట్యాంక్‌లు నిర్మాణం చేసేంత వరకైనా వాటి నిర్వహణపై శ్రద్ధ చూపాల్సి ఉంది. ఇవేమీ అధికారులకు పట్టడం లేదు. అల్లవరం మండలంలో అల్లవరం, బెండమూర్లంక ట్యాంక్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామాల్లోని ఓహెచ్‌ఆర్ ట్యాంకుల పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయి. మెట్లు విరిగిపోయాయి. ఉప్పలగుప్తం మండలంలో చింతలచెరువు, వాసాలతిప్ప ట్యాంక్‌లు శిథిలావస్థలో ఉన్నాయి. వాసాలతిప్పలో ఇటీవల కొత్త ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టారు.

వేసవిలో నీటిని నిల్వ చేసే స్టోరేజ్ ట్యాంక్‌లు మరింత నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వీటి నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. వీటి చుట్టూ అడవిని తలపించేలా చెట్లు, పొదలు పెరిగిపోవడం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లను పట్టించుకునే వారు కరవయ్యారు.

ప్రతిపాదనలు పంపించాం

> శిథిలావస్థకు చేరుకున్న ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లకు మెట్లు ఏర్పాటు చేసి పిల్లర్లకు మరమ్మతులు చేపడతాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.
>
> స్వామి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అల్లవరం.

రహదారి అడ్డగింతపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు



కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

అమలాపురం రూరల్: అమలాపురం–కాకినాడ హైవే వద్ద ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పెయ్యలవారిపేటలో పంచాయతీ రోడ్డుపై రాకపోకలు చేయకుండా దారికి అడ్డుగా కర్రలు పాతి అడ్డుకుంటున్నారని పెయ్యలవారిపేట వాసులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెయ్యలవారిపేటకు చెందిన పెయ్యల పరశురాముడు అనే వ్యక్తి తమను అడ్డుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కనీసం పంచాయతీ రోడ్డులో గల కుళాయి నుంచి తాగునీరు తెచ్చుకోడానికి కూడా వీలు లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కలెక్టర్‌కు విన్నవించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రామలింగేశ్వరునికి రుద్రహోమం



ఉప్పంగల రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

తాళ్లరేవు: ఉప్పంగల గ్రామంలోని పురాతన శివాలయంలో పవిత్ర మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు కె.సత్యనారాయణమూర్తి, మర్ల ఫణిశర్మ, బండ్లమూడి సుబ్రహ్మణ్యం, ఎం.బ్రహ్మాజీల పర్యవేక్షణలో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, బిల్వపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు.

కుండలేశ్వరునికి అభిషేకాలు

కాట్రేనికోన: కుండలేశ్వరంలో సోమవారం పార్వతీ సమేత కుండలేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కాళ్లకూరి కామేశ్వరరావు శర్మ ఆధ్వర్యంలో పార్వతీ సమేత కుండలేశ్వర స్వామికి విశేష పూజలు చేశారు. గణపతి పూజ, కుంకుమార్చన చేపట్టారు.

సీపీఎం మహాసభ విజయవంతానికి పిలుపు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా సీపీఎం మహా సభలను డిసెంబర్ 17, 18 తేదీల్లో అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నామని ఈ మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ తెలిపారు.

అమలాపురం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎం మహాసభలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని ఆల్ ఇండియా మహాసభలు 2025 ఏప్రిల్‌లో మధురైలో జరుగుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర మహా సభలు ఫిబ్రవరిలో నెల్లూరులో జరుగుతున్నాయని తెలిపారు. బహిరంగ సభలో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్ సుబ్బరావమ్మ, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు అండ్రా మాల్యాద్రి బీ బలరాం తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

తాళ్లరేవు: మండల పరిధిలోని జార్జీపేట, సుంకరపాలెం గ్రామ పంచాయతీలలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మించనున్న రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి ఎంపీపీ రాయుడు సునీత సోమవారం భూమిపూజ చేశారు. జార్జీపేట ఎంఎల్‌కె నగర్‌లో రూ.6 లక్షలతో డ్రెయినేజీ నిర్మిస్తున్నట్లు సునీత తెలిపారు. సుంకరపాలెంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాలుగు సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు, సుంకరపాలెం ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, జార్జీపేట సర్పంచ్ గుత్తుల సత్యవేణి, మండపల్లి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, నాయకులు రాయుడు గంగాధర్, వేగేశ్న భాస్కర్రాజు, కడలి శ్రీను, కూనపురెడ్డి కామేశ్వరరావు, మోపూరి వెంకటేశ్వరరావు, చీకట్ల నాగేశ్వరరావు, తాతపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వచేసిన రూ. 23 వేల ఎరువుల సీజ్



తాళ్లరేవులో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

తాళ్లరేవు: స్థానిక సత్య వీర వెంకట ఫెర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులు సక్రమంగా లేని రూ.23,138 విలువైన ఎరువులు, పురుగుమందులను సీజ్ చేసినట్టు మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి తెలిపారు. సోమవారం వ్యవసాయ శాఖ కరప సబ్‌డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.బాబూరావు మండల పరిధిలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. సంతపేట సెంటర్‌లోని దుకాణంలో రికార్డు సరిలేని కారణంగా సరుకు అమ్మకాలను నిలుపుచేసినట్లు తెలియజేశారు.

వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళం



దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు



వీరేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు మురమళ్ల గ్రామానికి చెందిన గోకవరపు త్రిమూర్తులు దంపతులు సోమవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా దాతకు నిర్వాహకులు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, పర్యవేక్షణ అధికారి కఠారి శ్రీనివాసరాజులు దాతను అభినందించారు.

మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం మార్గశిర మాసం ఆరుద్ర నక్షత్రం, సోమవారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. ఈ మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున పరమేశ్వరునికి అభిషేకం జరిపించి, దర్శిస్తే విశేష ఫలితం లభిస్తుందని శాస్త్ర వచనం. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి పంచామృతాభిషేకంలో పాల్గొన్నారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో దర్శనాలు, పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణం అడ్డగింత

ఆందోళనకు దిగిన స్థానికులు



కామనగరువు అబ్బిరెడ్డి రామదాసు కాలనీలో ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ కార్యకర్తలు, మహిళలు

అమలాపురం రూరల్: కామనగరువు అబ్బిరెడ్డి రామదాసు కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గణపతి ఆలయం నిర్మిస్తుంటే అధికారులు అడ్డుకుంటున్నారని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మహిళలు సోమవారం ధర్నా నిర్వహించారు. కాగా సబ్‌స్టేషన్ స్థలంలో ఆలయ నిర్మాణం చేపట్టారని విద్యుత్ అధికారులు ఆర్డీవో మాధవికి ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ అధికారులతో కలిసి కాలనీలో నిర్మాణం చేస్తున్న స్థలాన్ని ఆర్డీవో పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్నారని తక్షణమే ఆలయాన్ని తొలగించాలని పంచాయతీ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. దేవాలయ నిర్మాణ పనులను తొలగించేందుకు కామనగరువు పంచాయతీ సిబ్బంది రావటంతో మహిళలు అడ్డుపడి ఆందోళనకు దిగారు. ఈ ధర్నాకు బజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకుడు శిరంగు నాయుడు, నగర్ బజరంగ్‌దళ్ ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య, పిచ్చుక సుబ్బారావు, చింతా హేమ కుమార్, సీతారాం మద్దతు తెలిపారు. పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి బుధవారం వరకు తొలగింపు చేయకుండా వాయిదా వేశారు.

సోలార్ పవర్‌తో వినియోగదారులకు మేలు

విద్యుత్ శాఖ ఏడీఈ విష్ణుమూర్తి



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ ఏడీఈ విష్ణుమూర్తి

తాళ్లరేవు: గృహాల వద్ద సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని విద్యుత్‌శాఖ కాకినాడ రూరల్ ఏడీఈ టి.విష్ణుమూర్తి తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంధన వినియోగానికి చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. సోలార్ పవర్ కారణంగా విద్యుత్ బిల్లులు ఎంతో ఆదా అవుతాయని, అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు కేవీలకు రూ.78 వేల చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వం తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ టీవీ సుబ్రహ్మణ్యం, జేఈ నాగరాజు, తాళ్లరేవు, ఇంజరం విద్యుత్‌శాఖ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతన్న లాస్‌పేట ఎమ్మెల్యే వైద్యనాథన్

యానాం: నియోజకవర్గ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని పుదుచ్చేరి లాస్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే, సీఎల్‌పీ నాయకుడు వైద్యనాథన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక యానాం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అర్ధాని దినేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు అర్ధాని దినేష్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సరైన వైద్యం అందక రోగులు అత్యవసర వైద్యానికి కాకినాడలో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. రీజెన్సీ పరిశ్రమ తెరిపించడం, పేదలకు గృహ నిర్మాణం, కనకాలపేట డంపింగ్ యార్డు సమస్య తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్థలాలు మంజూరు చేయలేదంటూ నిరసన

వైఎస్సార్ సీపీ హయాంలో ఇళ్ల పట్టాల అందజేత



కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళలు

అమలాపురం రూరల్: గతం ప్రభుత్వంలో జగన్న లేఅవుట్‌లో తమకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని ఇప్పటి వరకు అధికారులు ఇళ్ల స్థలాలు చూపలేదని అమలాపురం మండలం పేరూరు పంచాయతీ పరిధి నారాయణపేట రెల్లి కాలనీ వాసులు జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న తమకు ఇందుపల్లి గ్రామంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని అధికారులు స్థలాలు చూపడంతో తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయాలు



యానాం ఐక్యగ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

యానాం: సమాజానికి క్రీస్తు బోధనలు దోహదపడతాయని అంతర్జాతీయ ప్రసంగీకులు శామ్యూల్ కర్మోజీ పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక న్యూ బస్టాండ్ ఆవరణలోని ఓపెన్ ఆడిటోరియంలో యానాం ఐక్యగ్రాండ్ క్రిస్మస్ వేడుకలు కాకినాడ జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు, తాళ్లరేవు వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుడు రెవరెండ్ దొమ్మేటి సామ్యూల్ సాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా యానాం ఐక్యగ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారని వాటి విజయవంతానికి తాను ఎల్లప్పుడూ పూర్తిగా సహకరిస్తుంటానని తెలిపారు. అంతకుముందు నిర్వహించిన క్రైస్తవ గీతాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా క్రీమ్ సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు, పి.డేవిడ్, జయానందకుమార్, సాల్మన్‌రాజు, విజయకుమార్, విలియం అల్బర్ట్, జార్జిముల్లర్, పి జాన్‌ప్రసాద్, పి జోసఫ్, ప్రసాదరావు, డి ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

యానాం: నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి పుదుచ్చేరి ప్రభుత్వం పూర్తిగా సహకరించాలని వివిధ పథకాలకు కావాల్సిన నిధులు మంజూరులో న్యాయం చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో 'ఆడిట్ సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్' పబ్లిక్ అకౌంట్స్ కమీటీ సమావేశం చైర్మెన్ కెఎస్‌పి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని పుదుచ్చేరికి వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న యానాం నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి సాధించడానికి వీలుగా వివిధ పరిశ్రమలను తెరిపించాల్సి ఉందన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ వరద నియంత్రణ కోసం రూ.137 కోట్లతో చేపట్టాల్సిన ఫ్లడ్ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్పీకర్ ఆర్ సెల్వం, డిప్యూటీ స్పీకర్ రాజవేలు, డీఎంకే ఎమ్మెల్యేలు శివ, నాజియం, ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు సంపత్, సింధిల్ కుమార్, అర్ముగం, కాంగ్రెస్ ఎమ్మెల్యే వైద్యనాధన్, ఆర్ఏఓ మునిస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పాఠశాల సందర్శన



ఎమ్మెల్సీ గోపిమూర్తితో ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: ఇటీవల కాలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన బొర్రా గోపిమూర్తి మండలంలోని భీమనపల్లి శిరంగు రంగ నాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. వీటిని ప్రభుత్వానికి తెలియపరచి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం నూకల సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు అత్తిలి సురేష్ కుమార్, ఎస్.పద్మనాభన్, కె.మధుసూధన్ రావు, ఆర్.వెంకటేశ్వరరావు, ఏఎస్.నాయుడు పాల్గొన్నారు.

తుపాను నష్ట పరిహారం జమ

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటించిన ఫెంగల్ తుపాను నష్ట పరిహారం రూ.5 వేలు ఆయా రేషన్ కార్డు దారుల బ్యాంకు ఖాతాలకు సోమవారం జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. యానాం, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్‌ల పరిధిలోని రేషన్ కార్డు దారుల ఆధార్ నెంబరుతో అనుసంధానించ బడిన బ్యాంక్ ఖాతాకు నేరుగా సొమ్మును జమ చేసినట్లు అధికారులు తెలిపారు. యానాం నియోజకవర్గానికి సంబంధించి 10,895 బీపీఎల్ ఎరుపురంగు రేషన్ కార్డు దారులకు రూ.5.44 కోట్లు, 4,965 ఏపీఎల్ పసుపు రంగు రేషన్‌కార్డు దారులకు రూ.2.48 కోట్ల పరిహారాన్ని ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఆందోళన

కాట్రేనికోన: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని దీనికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాట్రేనికోన గేట్ సెంటరులో ధర్నా చేపట్టారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయితాబత్తుల పండుబాబు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముమ్మిడివరం నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ కన్వీనర్ పాలెపు ధర్మారావు మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచమని చెప్పి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పేదలను మోసగించి చార్జీలను పెంచిందన్నారు. తక్షణం చార్జీలు తగ్గించాలని కోరుతూ డీటీ సత్యవతికి వినతిపత్రం అందజేశారు.

శిక్షణా తరగతులకు హాజరు కండి

ఐ.పోలవరం: గ్రామాల సమగ్రాభివృద్ధిపై కార్యాచరణ రూపొందించే అంశంపై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి ఈ నెల 17 నుంచి 18వ తేదీ వరకు రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డీఎల్ఎస్ శాస్త్రి సోమవారం పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. శిక్షణా కార్యక్రమానికి ఉద్యోగులంతా తప్పక హాజరు కావాలని సూచించారు.